సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 4 । మార్చి । 2024



మూడంచెల భద్రత

ప్రధాని మోదీ ఆదిలాబాద్ పర్యటన నేపథ్యంలో పోలీస్‌శాఖ మూడంచెల భద్రత ఏర్పాటు చేసింది. 1700 మంది పోలీసులతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. 8లో▸

రేపటి నుంచి సోయా కొనుగోళ్లు

కైలాస్‌నగర్: ఇటీవల నిలిపివేసిన సోయా కొనుగోళ్లను రేపటినుంచి పునఃప్రారంభించనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. రూ.4,600 కనీస మద్దతుధరతో నాఫెడ్‌ద్వారా ఆదిలాబాద్, జైనథ్, ఇచ్చోడ మార్కెట్ యార్డుల్లో కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పంట విక్రయించ ని రైతులు జిల్లా కొనుగోలు కమిటీని సంప్రదించి ధ్రువీకరణ పత్రం పొందాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /18.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ప్రధానికి 'జోగు' బహిరంగ లేఖ

- జిల్లా సమస్యలను ప్రస్తావించిన మాజీ మంత్రి రామన్న



లేఖ విడుదలచేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎదులాపురం: ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కేంద్రం పరిధిలోని సమస్యలపై ప్రధాని తక్షణమే స్పందించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆదివారం ఆయన ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాశారు. ఈమేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో పార్టీ నేతలు ఆ లేఖను విడుదల చేశారు. కేంద్రం పరిధిలోని సీసీఐ పునరుద్ధరణ, ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్, విమానాశ్రయం, కాటన్ ఆధారిత పరిశ్రమ, గిరిజన యూనివర్సిటీ వంటి సమస్యలను లేఖలో ప్రస్తావించారు. గతంలో పలుమార్లు సీసీఐ పునరుద్ధరణ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేదన్నారు. గతంలో కేంద్రహోంశాఖ సహాయ మంత్రి సీసీఐను సందర్శించిత్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు ఉలుకు పలుకు లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఇచ్చిన ప్రకటనను గుర్తు చేశారు. ఆదిలాబాద్ అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇందులో నాయకులు నారాయణ, రమేశ్, యోగేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు డీఈవో కార్యాలయం ముట్టడి

ఎదులాపురం: సమస్యల పరిష్కారంలో జిల్లా విద్యాశాఖాధికారి నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మంగళవారం డీఈవో కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, అశోక్ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏఎస్‌వోగా నియమించిన ఉపాధ్యాయుడిని విధుల్లో చేర్చుకోవడంలో డీఈవో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సోమవారంలోగా విధుల్లో చేర్చుకోలేకపోతే కార్యాలయాన్ని మంగళవారం ముట్టడిస్తామని పేర్కొన్నారు.

పోలియోరహిత సమాజానికి పాటుపడాలి



చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హమాలీవాడ పట్టణ ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు చుక్కల మందు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండు చుక్కలతో చిన్నారుల్లో వైకల్యం రా కుండా నివారించవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా 730 కేంద్రాల ద్వారా 78వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. మిగిలిపోయిన వారికి వైద్య సిబ్బంది సోమ, మంగళవారాల్లో ఇంటింటికి వెళ్లి వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీనివాస్, మాస్ మీడియా అధికారి వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీపై ఆశలు



- నేడు ఆదిలాబాద్‌కు ప్రధానమంత్రి
- ఉమ్మడి జిల్లాపై వరాలు కురిపించేనా?
- ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేనా..
- ఎయిర్‌పోర్టు.. లేదంటే విమానయాన శిక్షణ కేంద్రం ఏర్పాటుపై తేల్చేనా
- తాజాగా ఐఐహెచ్‌టీ ఉమ్మడి జిల్లాకు కేటాయించాలనే డిమాండ్
- సింగరేణి కార్మికులకు ఆదాయపన్ను మినహాయింపుపై స్పందించేనా..



ప్రధానమంత్రి మోదీ పాల్గొనే బహిరంగ సభ వేదిక ఏర్పాట్లు

సాక్షి,ఆదిలాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం ఆదిలాబాద్‌కు విచ్చేయనున్నారు. అధికారిక కార్యక్రమాలతో పాటు పార్టీపరంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొననున్నారు. పీఎం రాక నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా పలు ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాకపోవడం, పూర్తిస్థాయిలో నిధులు సమకూర్చకపోవడంతో అనేక నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయి. పలు ప్రతిపాదనలకు ఏళ్లుగా మోక్షం లభించడం లేదు. ఈ క్రమంలో ఈ ప్రాంత వాసులు ప్రధాని ప్రకటించే వరాలపై ఆశగా ఎదురుచూస్తున్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు..

మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, రెబ్బెన రైల్వేస్టేషన్లు ప్రస్తుతం సౌత్ సెంట్రల్ రైల్వే (ఎస్‌సీఆర్) డివిజన్ పరిధిలో ఉన్నాయి. వీటిని కలిపికాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఏళ్లుగా డిమాండ్ ఉంది. తద్వారా ఇతర సెక్షన్ రైల్వే మార్గాలతోటి అనుసంధానం పెరిగి ప్రయాణ సౌకర్యం పెరుగుతుందన్న అభిప్రాయం ఉంది. ఆర్మూర్-జగదల్‌పూర్ వయా మంచిర్యాల ఎన్‌హెచ్ 63కి సంబంధించి నిర్మాణంలో తీవ్రజాప్యం జరుగుతుంది. భూసేకరణ త్వరితగతిన పూర్తిచేసి నిధులు మంజూరు చేస్తే ఇది నిర్మాణానికి నోచుకుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇదే రోడ్డుకు సంబంధించి మంచిర్యాలలో బైపాస్ నిర్మాణంలోనూ జాప్యం చోటు చేసుకుంటుంది. దీనికి సంబంధించి నిధులు విడుదల చేయాలనే డిమాండ్ స్థానికుల నుంచి వ్యక్తమవుతుంది. బెల్లంపల్లి-గడ్చిరోలి మధ్య కొత్త హైవే నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలకే పరిమితమైంది. మంచిర్యాల-బల్లా ర్షా,మంచిర్యాల-కాజీపేట-వరంగల్‌ల మధ్య కొత్త ప్యాసింజర్ రైళ్లు మంజూరు చేయాలని ఏళ్లుగా డిమాండ్ ఉంది. వాటికి మోక్షం కలగడం లేదు. కరోనా సమయంలో సూపర్‌ఫాస్ట్ రైళ్ల హాల్టింగ్ నిలుపుదల చేయడంతో మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, రెబ్బెన ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరిగి ఈ రైళ్లను పునరుద్ధరించాలని డిమాండ్ వ్యక్తమవుతుంది. కవ్వాల్ టైగర్ రిజర్వులో పులు లకదలిక అంతగా లేకపోవడంతో ఆంక్షలను సడలించాలనే డిమాండ్ గిరిజనుల నుంచి వ్యక్తమవుతుంది. ఈవిషయంలో కేంద్రం నుంచి ఏదైన కీలక నిర్ణయం వెలువడుతుందా అని ఎదురుచూస్తున్నారు.


సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను విషయంలో..

సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను మినహాయించాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. ఈ భారాన్ని కోల్ ఇండియా భరించాలని కోరింది. అయితే కేంద్రం నుంచి ఎలాంటి చొరవ లేకపోవడంతో కార్మికుల్లో నిట్టూర్పు వ్యక్తమవుతోంది. ఈ విషయంలో ప్రధాని ఏదైనా ప్రకటన చేస్తారా అని ఎదురుచూస్తున్నారు.

ఐఐటీహెచ్ ఏర్పాటు చేయాలి..

గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన వర్సిటీ ఏర్పాటు చేస్తారని ఆశించినప్పటికీ చివరికి అది ములుగుకు కేటాయించారు. ఇలా ఉమ్మడి జిల్లాపై చిన్నచూపు చూశారన్న విమర్శ ఉంది. తాజాగా కేంద్రం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని రాష్ట్రానికి మంజూరు చేసింది. దీన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. ప్రధాని నుంచి దీని విషయంలో స్పష్టత రావాలని, ఈ దిశగా జిల్లా బీజేపీ నేతలు ఒత్తిడి తీసుకురావాలనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఐఐహెచ్‌టీలో రెగ్యులర్ శిక్షణతో పాటు టెక్నికల్ టెక్స్‌టైల్‌కు సంబంధించిన చదువులు, టెక్స్‌టైల్, దుస్తుల డిజైన్, మార్కెటింగ్, అంతర్జాతీయ వర్తకంవంటి అంశాల్లో బోధన అందనుంది. జౌళి పరిశ్రమ మరింతగా అభివృద్ధి చెందడానికి దోహదపడుతుందన్న అభిప్రాయం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్‌లో పత్తి పంట డిమాండ్ అధికంగా ఉంది. ఈ క్రమంలో ఈ చేనేత సాంకేతిక విద్యా సంస్థను కేటాయించాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది.

ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్‌పై..



ఆదిలాబాద్ రైల్వే స్టేషన్

ఆదిలాబాద్-నిర్మల్-ఆర్మూర్ మీదుగా పటాన్‌చెరు వరకు నిర్మించే రైల్వే మార్గంపై ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లావాసుల దశాబ్దాల కల. కొద్ది నెలల క్రితం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదిలాబాద్-పటాన్‌చెరు ప్రణాళిక సిద్ధమని ప్రకటించారు. 317 కిలోమీటర్ల పరిధిలో నిర్మించే ఈ ప్రాజెక్టుకు సంబంధించి రూ.5,706 కోట్లు అంచనా వ్యయంగా పేర్కొన్నారు. తుది సర్వే సైతం పూర్తయిందని ఇటీవల బీజేపీ నేతలు స్పష్టం చేస్తూ వస్తున్నారు. దీనికి సంబంధించి ప్రధాని స్పష్టమైన హామీ ఇస్తారా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. బెంగళూరు-నాందేడ్, పూణే-నాందేడ్ మధ్యలో నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆదిలాబాద్ వరకు పొడిగించాలనే డిమాండ్ ఉంది. దేశంలో రెండో సిలికాన్ సిటీ అయిన పూణేకు రైల్వే మార్గం ఏర్పడితే ఈ ప్రాంత యువతకు సౌకర్యంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. కాజీపేట-ఆదిలాబాద్ మధ్యలో, నాగ్‌పూర్-ఆదిలాబాద్ మధ్యలో ఇంటర్‌సిటీ కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలనే డిమాండ్ కూడా ఉంది. వీటికి సంబంధించి ఆదిలాబాద్ పౌర సమాజం సభ్యులు పలుమార్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులకు వినతి పత్రాలు అందించారు.

సీసీఐ పునరుద్ధరణపై..



మూతపడ్డ సీసీఐ ఫ్యాక్టరీ

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని ఈ ప్రాంతంలో డిమాండ్ ఉంది. ఈ యూనిట్‌ను పునరుద్ధరిస్తే తెలంగాణ అవసరాలకే కాకుండా మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా సిమెంట్ సరఫరా చేసేందుకు వీలవుతుందని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

నేడు గవర్నర్ రాక..

కైలాస్‌నగర్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ సోమవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈమేరకు ఆమె పర్యటనకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ విడుదలైంది. ప్రధాని నరేంద్రమోదీకి సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి స్వాగతం పలకనున్నారు. అలాగే జిల్లా కేంద్రంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రధాని శంకుస్థాపన చేసే కార్యక్రమాల్లో పాల్గొంటారని గవర్నర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

సీఎం రేవంత్‌రెడ్డి సైతం..

సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 4న ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రానున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8గంటలకు హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 9గంటలకు ఆదిలాబాద్ చేరుకుంటారని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి 11.15 గంటల వరకు స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రధాని మోదీతో కలిసి వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారని తెలిపారు. తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు ఆదిలాబాద్ నుంచి ముఖ్యమంత్రి బయలుదేరి వెళ్తారని పేర్కొన్నారు.

ఎయిర్‌పోర్ట్ లేనిపక్షంలో ఎయిర్‌ఫోర్స్..



విమానాశ్రయ మైదానం

ఆదిలాబాద్‌లో 360 ఎకరాల విస్తీర్ణంలో రక్షణ శాఖ భూమి ఉంది. దీన్ని విమానాశ్రమ మైదానంగా పేర్కొంటున్నారు. సోమవారం ప్రధానమంత్రి మోదీ హెలికాప్టర్ కూడా ఇదే మైదానంలో దిగనుంది. కాగా ఇక్కడ ఎయిర్‌పోర్ట్ లేనిపక్షంలో విమానయాన శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఏళ్లుగా ఉంది. గతంలో పలు సర్వేలు జరిగినప్పటికీ వీటిలో ఏది సాకారం కాలేదు. మధ్యలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. దానికి కూడా మోక్షం లభించలేదు. తాజాగా ప్రధాని ఇక్కడికి రానుండడంతో దీనిపై ఏదైన కదలిక వస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది.

ప్రజాపాలన సేవా కేంద్రాలు

- సంక్షేమ పథకాల లబ్ధి కోసం..
- ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు
- నేటి నుంచి అందుబాటులోకి

కైలాస్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల ద్వారా తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతీ నిరుపేద కుటుంబానికి రూ.500కే గ్యాస్ సిలిండర్‌తో పాటు 200లోపు యూనిట్ల విద్యుత్ వినియోగించుకునే వారికి ఉచితంగా సరఫరా చేస్తామని ప్రకటించింది. ఈ పథకాలను గత నెల 27నుంచి అమల్లోకి తెచ్చింది. అయితే జిల్లాలో అర్హులైన చాలామందికి లబ్ధి చేకూరడం లేదు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రతీ పేద కుటుంబానికి లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటుకు ఆదేశించింది. సోమవారంలోగా జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో వీటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించింది.

అర్హులకు చేకూరని లబ్ధి..

తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించినప్పటికీ జిల్లాలో చాలా మంది వినియోగదారులకు జీరో బిల్లులు రాలేదు. ఆదిలాబాద్ పట్టణంలోని ఓ వార్డులో స్పాట్ బిల్లర్ 300నివాస గృహాలకు విద్యుత్ బిల్లులను జారీ చేశారు. ఇందులో 50, 80 యూనిట్ల విద్యుత్ వినియోగించినా చాలామందికి రూ.200 నుంచి రూ.300 వరకు బిల్లులు వచ్చాయి. వీటిలో కేవలం ఐదుగురికి మాత్రమే జీరో బిల్లులు రావడం గమనార్హం. మున్సిపాలిటీలోని పలు వార్డులతో పాటు జిల్లాలోని అనేక గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. అద్దె ఇళ్లలో నివాసముండే వారికి సైతం 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఆచరణలో కనిపించడం లేదు. దీంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితిని గుర్తించిన విద్యుత్‌శాఖ వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తమ ఆధార్ కార్డు, రేషన్‌కార్డుతో పాటు విద్యుత్ సర్వీస్ నంబర్‌ను స్పాట్ బిల్లర్లకు, ఏఈలకు అందించాలని ప్రకటన జారీ చేసింది. వాటికనుగుణంగా బిల్లులను సరి చేసి జారీ చేస్తారని స్పష్టం చేసింది.

సిలిండర్లదీ అదే పరిస్థితి

తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న నిరుపేదలకు రూ.500కే సిలిండర్ ఇస్తామని ప్రకటించింది. గ్యాస్ కనెక్షన్ ఎవరి పేరిట ఉన్నా అర్హులై ఉంటే చాలు లబ్ధి చేకూరుస్తామని స్పష్టం చేసింది. అయితే ఇది కూడా చాలామంది పేదలకు అమలు కాలేదు. ముఖ్యంగా పురుషుల పేరిట గ్యాస్ కనెక్షన్ ఉన్న వారికి సిలిండర్ పొందినా రాయితీ డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదు. ఈ నేపథ్యంలో అర్హులైన వారి నుంచి ఆందోళన వ్యక్తమైంది. స్పందించిన ప్రభుత్వం వెంటనే చర్యలకు సిద్ధమైంది.

సేవా కేంద్రాలు ఏర్పాటు..



ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరణ(ఫైల్)

గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల కింద లబ్ధి పొందని పేదలకు ప్రయోజనం కల్పించడమే లక్ష్యంగా ప్రజాపాలన సేవా కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులైన వారి వివరాలు సేకరించి నమోదు చేసేందుకు వీలుగా జిల్లాలోని అన్ని ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. శాశ్వత ప్రతిపాదికన పనిచేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొంది. సోమవారం నుంచి జిల్లాలోని అన్ని చోట్ల ఇవి అందుబాటులోకి రావాలని సూచించింది. అయితే జిల్లా యంత్రాంగం ఇప్పటి వరకు ఎలాంటి కసరత్తు చేపట్టలేదని తెలుస్తోంది. నేడు ఎన్ని కేంద్రాలను ప్రారంభిస్తుందనేది వేచి చూడాల్సిందే.

48వ రోజుకు రైల్వేలైన్ సాధన దీక్ష



శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వే లైన్ కోసం రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపడుతున్న రిలే దీక్షలు 48వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు దేవేందర్, ప్రధాన కార్యదర్శి నరేందర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రధాన సమస్యలైన ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్, సిమెంట్ ఫ్యాక్టరీ, గిరిజన వర్సిటీ, ఇండస్ట్రియల్ కారిడార్, టెక్స్‌టైల్ పార్క్, విమానాశ్రయం తదితరఅంశాలను పక్కనబెట్టి ప్రధాని మోదీ డ్రెయినేజీ నిర్మాణ ప్రారంభోత్సవానికి జిల్లాకు రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లాలోని ప్రధాన సమస్యలపై ప్రధాని స్పందించాలని, లేకుంటే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పేదోడి కడుపు నింపడమే కాంగ్రెస్‌కు తెలుసు

- కష్టపడ్డ కార్యకర్తలకు గుర్తింపు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- బోథ్ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

బోథ్: పేద కుటుంబాల కడుపు నింపడమే కాంగ్రెస్ పార్టీకి తెలుసని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. కష్టపడ్డ ప్రతీ కార్యకర్తను పార్టీ గుర్తుంచుకుంటుందన్నారు. పదవులు పొందిన నాయకులు ప్రజలకు సేవ చేయాలన్నారు. బోథ్ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం మండలకేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాలకవర్గ సభ్యులు బాధ్యతగా వ్యవహరిస్తూ రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునే కాంగ్రెస్ పార్టీని రానున్న ఎంపీ ఎన్నికల్లోనూ గెలిపించాలన్నారు. బోథ్ రెవెన్యూ డివిజన్, ఫైర్‌స్టేషన్ ఏర్పాటు, సొనాల మండలంలో నూతన కార్యాలయాలు, కొత్త పోస్టుల మంజూరు కోసం కేబినెట్‌లో ప్రస్తావిస్తానని తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు మాట్లాడుతూ.. ప్రజల్లో ఉంటేనే పార్టీ అవకాశం కల్పిస్తుందన్నారు. ఇందుకు తానే ఉదాహరణ అని అన్నారు. నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి మాట్లాడుతూ, రైతుల పక్షాన ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ముందుగా జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్, తెలంగాణ కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బజార్‌హత్నూర్ జెడ్పీటీసీ నర్సయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపల్లి శ్రీధర్, కిసాన్ సెల్ రాష్ట్ర నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రఫుల్‌రెడ్డి, మహమూద్‌ఖాన్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, రైతు సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే సంక్షేమం

ఇచ్చోడ: కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారనే ప్రజా సంక్షేమం జరుగుతుందని మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో గృహజ్యోతి పథకాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి గృహజ్యోతి పథకం ప్రారంభించినట్లు తెలిపారు. రెండు వందల యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకునే వారికి జీరో బిల్లుల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్ ఖాన్, వైస్ ఎంపీపీ జాల్రైజాకు, ఎస్ఈ జైవంత్‌రావు, డీఈ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

నేరడిగొండ: చిన్నారుల నిండు జీవితానికి.. రెండు చుక్కల మందు వేయించాలని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం బోథ్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో మండలకేంద్రంలో పల్స్ పోలియోకేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు పోలియోచుక్కలు వేశారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. మంత్రిని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజేందర్ శాలువాతో సత్కరించారు. వారివెంట ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నాయకులు మల్లేశ్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు వసంత్‌రావు, బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రఫుల్‌చందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గజ్జలమ్మ దేవికి పూజలు



ఎస్సై రజనీకాంత్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, పల్లకిసేవ నిర్వహించారు. చిన్నపిల్లలు తలనీలాలు, తులాభారం వేయించి మొక్కు చెల్లించుకున్నారు. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, బోకర్, ధర్మాబాద్, శివుని, ఇస్లాపూర్, అప్పారావుపేట్ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి నైవేద్యాలు సమర్పించారు. ఎస్సై రజనీకాంత్ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నివేదిక



నివేదిక చదువుతున్న దేవేందర్

ఎదులాపురం: హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్ సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ అధ్యక్షతన ఆదివారం రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ పాల్గొని జిల్లా నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై గతంలో చేపట్టిన పోరాటాలు, నిరసనలు, ధర్నాలు ఇతరత్రాను వివరించారు. అనంతరం భవిష్యత్‌లో నిర్వహించే కార్యక్రమాలను గురించి తెలియజేశారు.

పెద్ద.. చేప!



చేపను చూపిస్తున్న మత్స్యకారుడు సురేశ్

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ పెద్ద చెరువులో ఆదివారం మత్స్యకారులు చేపల వేటకు వెళ్లారు. మత్స్యకారుడు సురేశ్‌కు సుమారు 8 కిలోల బరువు గల రవు రకానికి చెందిన నాలుగు పెద్దచేపలు వలకు చిక్కాయి. కుంటాల సంతలో కిలోకు రూ.140 చొప్పున విక్రయించాడు.

అదృశ్యమైన యువకుడి మృతి

ఆదిలాబాద్‌రూరల్: అదృశ్యమైన యువకుడు శవ మై తేలాడు. మండలంలోని భీంసరి గ్రామానికి చెందిన యువకుడు బోడికే ప్రశాంత్ (30) శుక్రవారం అదృశ్యమయ్యాడు. కుటుంబీకులు అన్నిచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్న క్రమంలో నిజామాబాద్ జిల్లా పోచంపాడ్ సమీపంలోని ఎస్సారెస్పీ రిజర్వాయర్‌లో ఆదివారం యువకుడి మృతదేహం లభ్యమైంది. కాగా, యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక ప్రమాదవశాత్తు పడి మృతి చెందడా అనే కారణాలు తెలియలేదు. పోచంపాడు పోలీసులు అందించిన సమాచారం మేరకు కుటుంబీకులు వెళ్లి మృతదేహాన్ని ప్రశాంత్‌గా నిర్ధారించారని పేర్కొన్నారు.

మూడంచెల భద్రత

- ప్రధాని పర్యటనకు భారీ బందోబస్తు
- 2వేల మంది పోలీసులు, కమెండోలు
- ఎస్పీజీ వలయంలో స్టేడియం, ఏరోడ్రమ్

ఎస్పీలు: 07
అడిషనల్ ఎస్పీలు: 07
డీఎస్పీలు: 13
సీఐలు: 40
ఎస్సైలు: 101
మహిళా ఎస్సైలు: 20
ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు: 200
కానిస్టేబుళ్లు: 700
మహిళా ఏఎస్సైలు /హెడ్‌కానిస్టేబుళ్లు: 30
మహిళా కానిస్టేబుళ్లు: 45
హోంగార్డులు: 200
మహిళా హోంగార్డులు: 20



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఐజీ ఏవీ రంగనాథ్

కైలాస్‌నగర్: ప్రధాని మోదీ ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు పోలీస్ శాఖ మూడంచెల భద్రత ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని 15 జిల్లాలకు చెందిన 1700 మంది పోలీసులతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. వారిని పది సెక్టార్లుగా విభజించి విధులు కేటాయించారు. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ), గ్రేహౌండ్స్ ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యూ) వంటి కేంద్ర బలగాలకు చెందిన మరో 300 మందితో రక్షణ కల్పించనున్నారు. మొత్తం 2 వేల మంది పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరు ఐడీ కార్డులు ధరించడంతో పాటు తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విధులు నిర్వహించేలా ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాలు జారీచేశారు.

కట్టుదిట్టమైన భద్రత

ప్రధాని రాక నేపథ్యంలో 2వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నారు. జిల్లాలకు చెందిన ఏడుగురు ఎస్పీలు, ఏడుగురు అదనపు ఎస్పీలతోపాటు వివిధ కేటగిరీలకు చెందిన 1700 మంది పోలీసులను నియమించారు. ఎస్పీజీ ఆదేశాలకనుగుణంగా విధులు కేటాయించారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రధాని పాల్గొనే సభాస్థలి, హెలిప్యాడ్ ప్రాంతాల్లో డ్రోన్ల వాడకాన్ని నిషేధించారు. స్టేడియం, ఏరోడ్రమ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

ఎస్పీజీ వలయంలో..

ఏరోడ్రమ్ మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లతో పాటు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని సభ ప్రాంగణం ఎస్పీజీ వలయంలోకి వెళ్లిపోయింది. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఏరోడ్రమ్ నుంచి స్టేడియం వరకు ప్రధాని ప్రత్యేక కాన్వాయ్‌లో రానున్నందున ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా చేరుకునేలా రెండుసార్లు కాన్వాయ్‌తో రిహార్సల్ నిర్వహించారు. డ్రైవర్లు, రోప్‌పార్టీ పోలీసులు, గ్రేహౌండ్స్ సిబ్బందితో ఎస్పీజీ అధికారులు సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రధాని జిల్లాకేంద్రానికి చేరుకున్నప్పటి నుంచి తిరిగి వెళ్లేవరకు అనుసరించాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. బందోబస్తుఏర్పాట్లను ఎస్పీ గౌస్ ఆలం దగ్గరుండి పర్యవేక్షించారు.

విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు

ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రధాని సభాస్థలం ఉండగా, ఆ దారి గుండా ఆయా ప్రాంతాల్లో ఇంటర్ పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. కట్టుదిట్టమైన పోలీసు భద్రత ఉండడంతో ఎవరిని అనుమతించడం లేదు. కాగా విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా కేంద్రాలకు హాజరయ్యేలా పోలీసులు చూస్తున్నారు. నిర్ణీత సమయానికంటే ముందుగానే వారు కేంద్రాలకు చేరుకోవాలని ఎస్పీ సూచించారు. హాల్ టికెట్ ఉన్న విద్యార్థులను మాత్రమే అనుమతించాలని ఆదేశించారు.

బందోబస్తు పరిశీలన

ఎదులాపురం: ప్రధాని మోదీ సోమవారం జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను మల్టీ జోన్–1 ఐజీ ఏవీ రంగనాథ్ ఆదివారం రాత్రి పరిశీలించారు. హ్యాలీపాడ్ ప్రదేశాలు, సభాస్థలి, అభివృద్ధి కార్యక్రమాల స్థలాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అంతకుముందు మల్టీజోన్–1 ఐజీ ఏవీ రంగనాథ్‌కు ఎస్పీ గౌస్ ఆలం స్వాగతం పలికారు. మహబూబాబాద్ ఎస్పీ సుదీర్‌కే రామ్‌నాథ్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, డబ్ల్యూపీఎస్ సీఐ శ్రీనివాస్, ఎస్సై అన్వర్ ఉల్‌హక్ తదితరులు ఉన్నారు.



ఎస్పీజీ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం



పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్పీజీ అధికారులు

మద్య నిషేధం కోసం భారీ ర్యాలీ



గ్రామస్తులు, ఉద్యోగులు, మహిళల ర్యాలీ

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో మద్య నిషేధంపై గ్రామస్తులు, ఉద్యోగులు, మహిళలు ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించా రు. శివాజీచౌక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన మార్కెట్‌గుండా ప్రతి వీధిలో సాగింది. గ్రామంలో మద్యాన్ని నిషేధిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. మద్యం తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గ్రామపెద్దలు, శ్రీ సంత్ సేవాలాల్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ యువత నాశనానికి మద్యం కారణమని అన్నారు. గ్రామంలో మద్య నిషేధించినప్పుడే మార్పులు వస్తాయని పేర్కొన్నారు. ఎవరైనా మద్యం అమ్మితే క్రిమినల్ కేసులు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, మాజీ సర్పంచ్ రాథోడ్ మధుకర్, సంతోష్ పటేల్, తానాజీ నాయక్, కారోబార్ జాదవ్ పృథ్వీరాజ్, సంత్ సేవాలాల్ కమిటీ సభ్యులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులు చౌహాన్ కిశోర్, జాదవ్ పరశురామ్, చౌహాన్ పునిరాం, సూర్యవంశీ పండరి, రాథోడ్ గణేశ్, జాదవ్ ఆనంద్ రావ్, సురేష్ పాల్గొన్నారు.

అలరించిన 'యుఫోరియా'



సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ ఆదివారం సాయంత్రం సాంస్కృతిక సంబురంలో మునిగింది. వర్సిటీ కౌన్సెలింగ్ డిపార్ట్‌మెంట్ నిర్వహించిన 'యుఫోరియా–2024' సాంస్కృతిక కార్యక్రమం అలరించింది. ప్రత్యేకాధికారి సృజన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. పరీక్షలకు ముందు ఈ కార్యక్రమాలు విద్యార్థుల మానసికోల్లాసానికి తోడ్పాడుతాయని ఆమె పేర్కొన్నారు. నిర్వాహకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ఆత్మహత్య



అనిత (ఫైల్)



నివాళులర్పిస్తున్న డీఆర్‌డీవో విజయలక్ష్మి

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు దొడ్లి అనిత(50) ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్సై దిగంబర్ కథనం ప్రకారం..మృతురాలు నాలుగు నెలలుగా మానసికంగా బాధపడుతోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో సూపర్ వాస్మోల్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆదివారం తెల్లవారుజాము నిర్మల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి కుమారుడు పవన్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. కాగా, పార్థివదేహం వద్ద డీఆర్‌డీవో విజయలక్ష్మి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొంది. బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామన్నారు.

మద్యానికి బానిసై యువకుడి..

బజార్‌హత్నూర్: మండలంలోని జాతర్ల పంచాయతీ పరిధిలోని రాంనగర్ గ్రామానికి చెందిన యువకుడు జుగ్నక్ కైలాస్(28) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. హమాలి పనిచేసే కైలాస్ కొంత కాలంగా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. శనివారం రాత్రి మద్యం తాగి ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది ఆదివారం ఉదయం తన పొలంలో చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన గుర్రం నారాయణ(64) ఆదివారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గుర్రం నారాయణ, లింగవ్వ (61) దంపతులకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. అందరికీ వివాహమైంది. బర్రెల కాపరిగా జీతం ఉండేవాడు. మద్యం బానిసై రోజు తాగేవాడు. శనివారం భర్త డబ్బు అడిగితే ఇవ్వకపోవడంతో బర్రె గురించి రాత్రి బయటకు వెళ్లాడు. పోచమ్మ ఆలయం వద్ద గల మర్రి చెట్టుకు భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని గ్రామానికి చెందిన నర్సింలు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని ఒకరి..



నారాయణ మృతదేహం

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన గుర్రం నారాయణ(64) ఆదివారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గుర్రం నారాయణ, లింగవ్వ (61) దంపతులకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. అందరికీ వివాహమైంది. బర్రెల కాపరిగా జీతం ఉండేవాడు. మద్యం బానిసై రోజు తాగేవాడు. శనివారం భర్త డబ్బు అడిగితే ఇవ్వకపోవడంతో రాత్రి బయటకు వెళ్లాడు. పోచమ్మ ఆలయం వద్ద గల మర్రి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని గ్రామానికి చెందిన నర్సింలు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దావుజీనాయక్‌తండాలో..

కుభీర్: మండలంలోని దావుజీనాయక్ తండాకు చెందిన వివాహిత జాదవ్ జ్యోతి(30) ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఏఎస్సై శివయ్యను సంప్రదించగా తమకెలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. మార్చురీలో మృతదేహం ఉందన్నారు.

గుండెపోటుతో అటెండర్ మృతి

నిర్మల్‌టౌన్/కుంటాల: జిల్లాకేంద్రంలోని ఆర్అండ్‌బీ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న తురాటి ముత్తన్న (55) గుండెపోటుతో మృతిచెందాడు. మంజులాపూర్ శివాజీ కాలనీలో నివాసం ఉండే ముత్తన్న ఆదివారం సెలవుదినం కావడంతో ఇంటి వద్ద ఉన్నాడు. ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి స్వగ్రామం కుంటాల మండలంలోని అంబకంటి. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు ఉన్నాడు.

ఊబకాయం తగ్గేదెలా ?



- ప్రమాదకరంగా మారుతున్న వ్యాధి
- పలు రోగాలకు ఇదే కారణం
- నేడు 'ప్రపంచ ఊబకాయ వ్యతిరేక దినోత్సవం'

నిర్మల్‌ఖిల్లా: ప్రస్తుత సమాజంలో ఊబకాయం ఎంతో ప్రమాదకరంగా పరిణమిస్తోంది. ఆరోగ్య సమస్యల్లో ఇది ప్రధాన సమస్యగా మారుతోంది. మారుతున్న జీవన విధానంలో ఆహార అలవాట్లు మారుతుండటం ఊబకాయం (ఒబెసిటీ) వ్యాధికి కారణమని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. శారీరక వ్యాయామం లేకపోవడం ఇందుకు కారణం. పెద్దలతో పాటు చిన్నారులు ఊబకాయం బారినపడడం ఆందోళన కల్గిస్తుంది. ఈనెల 4న ప్రపంచ ఊబకాయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న కథనం.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో దాదాపు జనాభా 30 లక్షలు ఉండగా, అందులో 30 శాతం ఊబకాయులే. చిన్నపిల్లలు 20 శాతం వ్యాధి బారినపడుతున్నారు. నెయ్యి, డాల్డా, నూనె అధిక మోతాదులో కలిసిన ఆహార పదార్థాలు ఎక్కువగా తినటంతో రక్తంలో కొవ్వు శాతం పెరుగుతుంది. దీని కారణంగా ఊబకాయ బాధితుల్లో 40 శాతం మంది గుండెపోటుకు గురవుతున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం సమస్యలు వీరిని పట్టిపీడిస్తున్నాయి. పక్షవాతం, నరాల సమస్యలు వంటివి దారితీస్తున్నాయి. గత పదేళ్లలో ఆహార అలవాట్లు ఇతరత్రా కారణాల వల్ల చిన్నారుల్లో ఊబకాయ సమస్య తీవ్రంగా ఉంది.

జాగ్రత్తలు ఇవే..

- ఊబకాయ సమస్యతో బాధపడేవారు శరీర బరువు తగ్గాలంటే వారంలో రెండు రోజులు ఉపవాసం చేయాలి.
- 20 ఏళ్లు దాటినవారు ప్రతీరోజు 2,500 కేలరీలు తీసుకోవాలి. ఏ ఆహారం తీసుకున్న ఈ కేలరీలు దాటకుండా చూసుకోవాలి. మిగిలిన రెండు రోజుల్లో కేవలం పావు వంతు అంటే 500 కేలరీలు మాత్రమే తీసుకోవాలి.
- కార్బొహైడ్రేట్లు తక్కువగా ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. కూరగాయలతోపాటు అన్నానికి బదులు రాగి, జొన్న, చేపలు, చికెన్ తీసుకోవాలి.
- కాఫీ టీ తీసుకోవచ్చు. తరచూ నీటిని తాగుతూ ఉండాలి.

వ్యాయమాలు చేయాలి



చాలామంది ఒబెసిటీకి గురవుతుంటారు. మొదటి నుంచే బరువు పెరుగకుండా సమతుల్యత పాటిస్తే ఊబకాయాన్ని కచ్చితంగా నివారించవచ్చు. మంచి ఆహారపు అలవాట్లు, మానసిక ప్రశాంతత, రోజు వ్యాయమాలు చేయాలి.

– ఎండపల్లి అశోక్ కుమార్, మైథిలీ వెల్నెస్ సెంటర్ నిర్వాహకులు, నిర్మల్

ముందు జాగ్రత్తలు పాటించాలి



సమతుల్యమైన ఆహారపు అలవాట్లు రోజు తీసుకోవాలి. వ్యాయమాన్ని కొనసాగిస్తే బరువు పెరగకుండా కాపాడుకోగలుగుతాం. ఒబెసిటీకి గురయ్యాక చేసే వర్కవుట్ల కంటే ముందస్తు జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ బి.రవికుమార్, ఎండీ, జనరల్ మెడిసిన్, నిర్మల్

పదోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న రాథోడ్ గణేశ్

ఉట్నూర్‌రూరల్: గిరిజన ఉపాధ్యాయులకు టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలని టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గణేశ్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీ డీఎస్సీలో గిరిజన యువతతో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయుల పీఆర్సీలు, డీఏలు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడే టీటీఎఫ్‌ను ఆదరించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జాదవ్ రవీందర్, కుమురం భీం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రవీందర్, జిల్లా కార్యదర్శి రాథోడ గణేశ్, ఉట్నూర్ మండల అధ్యక్షుడు పవన్‌లాల్, వేర్‌సింగ్, ఇందల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటు చేస్తాం



మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: జిల్లాలో స్కౌట్ బలోపేతానికి కృషి చేస్తానని గిరిజన సంక్షేమశాఖ డీడీ డాక్టర్ దిలీప్‌కుమార్ అన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అసోషియేషన్ ఆధ్వర్యంలో ఉట్నూర్‌లోని కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న పెట్రోల్ లీడర్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని అన్ని పాఠశాలల్లో స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటు చేసేలా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ప్రత్యేక కార్యచరణ రూపొందించి మరిన్ని శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అంతకు ముందు స్కౌట్ విద్యార్థులు డీడీని సన్మానించారు. స్కౌట్ మాస్టర్లు గైడ్ కెప్టెన్లు, ఏటీడీవో క్రాంతికుమార్, స్పోర్ట్స్ అధికారి పార్థసారథి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ ఫర్ గైడ్స్ డాక్టర్ ప్రమోదిని, లీడర్ ఆఫ్ ద క్యాంప్ రామ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్.స్వామి, కాశీరాం, ఉత్తం పాల్గొన్నారు.

మోదీ సభ జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

కై లాస్‌నగర్: జిల్లాకేంద్రంలో సోమవారం జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభకు ప్రజ లు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మోదీ సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడా రు. బంగారు తెలంగాణగా ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారన్నారు. కాంగ్రెస్ తీర్చలేని హామీలతో గద్దెనెక్కింద ని ఆరోపించారు. ప్రభుత్వాలు ఏవైనా ప్ర జా శ్రేయస్సు లక్ష్యంగా భావించే కేంద్ర ప్ర భుత్వం ప్రజలను ఆదుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్రానికి రూ.9 వేల నిధులు అందించిందన్నారు. జిల్లాలోని సమస్యలను ప్రధా ని దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చే స్తామని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేయాలి



మాట్లాడుతున్న మురళీ మనోహర్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: ఉపాధ్యాయులకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీయూటీఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మురళీ మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈనెల 9న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు 40 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన నూతన పీఆర్సీని ప్రకటించాలన్నారు. వేసవిలో బదిలీలు ప్రమోషన్లు చేయాలన్నారు. 317 జీవోపై మంత్రివర్గ సబ్ కమిటీ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. పెండింగ్ బిల్లులు, డీఏ బకాయిలు మంజూరు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, తొడిశెట్టి రవికాంత్, జిల్లా కోశాధికారి పోలా ధర్మరాజు, గౌరవ అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వహీద్ ఖాన్, సునీల్‌రెడ్డి, తోట గంగాధర్, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.